

# మనం

## నల్లగొండ

సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

గురువారం | 22 | అక్టోబర్ | 2026 | పేజీలు 7 | www.manamepaper.com




### అమరుల త్యాగాలను

# స్మరించుకోవడమే నిజమైన నివాళి

## బెటాలియన్ కమాండెంట్ బి. రామకృష్ణ

**పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే వారికి ఇచ్చే నిజమైన నివ్వాలని బెటాలియన్ కమాండెంట్ బి. రామకృష్ణ అన్నారు.బుధవారం 12వ బెటాలియన్ అన్నెపర్తిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు.అసిస్టెంట్ కమాండెంట్ నర్సింగు వెంకన్న గత ఏడాది కాలంలో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన 154 మంది పోలీసుల పేర్లను చదివి వినిపించారు.**

నల్గొండ, అక్టోబర్ 21 ( మనం ప్రతినిధి) : అనంతరం ఆర్ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో స్మృతి పరేడ్ నిర్వహించారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటామని తెలిపారు.అమరవీరుల సేవలు,త్యాగాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వారం రోజులపాటు రక్తదాన శిబిరం, సైకిల్ ర్యాలీ, లఘుచిత్రాలు, ఛాయాచిత్రాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదనపు కమాండెంట్ ఎల్.నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్లు కె.మహేందర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దయాకర్, యూనిట్ వైద్యాధికారి ఆర్. షర్మిలాదేవి, నితిన్ గౌతమ్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హోంగార్డులు, నాలుగో ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



### అసంపూర్తిగా

# అంగన్‌వాడీ భవన నిర్మాణం!

వివరాలు 3లో..

## రూ.7.50 లక్షల తొలి బిల్లు తీసుకున్న కాంట్రాక్టర్

### పనుల జాప్యంపై గ్రామస్థుల ఆవేదన.. ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

**చిన్నారులు, గర్భిణీలకు తప్పని ఇబ్బందులు**

**అంగన్‌వాడీ చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న అంగన్వాడి భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.**

*అనంతగిరి అక్టోబర్ 21( మనం న్యూస్)*

### ఎండుతున్న పంటలకు

# సాగునీరు ఎక్కడ ఉత్తమ్?

**కొత్త లిఫ్టులు రైతుల ప్రయోజనం కోసమా? మీ కమిషన్ల కోసమా ఉత్తమ్?**

**ఇరిగేషన్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నేతల ధర్నా**

**మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



కోదాడ, అక్టోబర్ 21(మనం న్యూస్): నడిగూడెం మండల రైతాంగానికి తక్షణమే సాగునీరు అందించి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య

- మిగతా 2లో..

# ఎండుతున్న పంటలకు సాగునీరు ఎక్కడ ఉత్తమ్?

మొదటి పేజీ తరువాయి

యాదవ్ నడిగూడెం మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ ఉప కార్యనిర్వాహక ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాగునీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేసి అధికారులకు వినతి పత్రం అందించారు. ఎల్34, ఎల్35, ఎల్36 లిఫ్టుల ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి, నడిగూడెం మండలంలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. అప్పులు చేసి రైతులు పంటలు పండిస్తున్న సమయంలో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, అధికారులు ఇకనైనా స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం రైతుల సాగునీటి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పంటలు సాగు చేసిన రైతులకు సకాలంలో నీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుబాటులో ఉన్న లిఫ్టులు, ప్రాజెక్టులు, కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నడిగూడెం ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తుంటే, నీటిని పక్కనే ఉన్న ఖమ్మం జిల్లా పాలేరు ప్రాంతానికి తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా నీటి పంపిణీ చేపట్టడం వల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. "మత్తు నిద్రలో ఉన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికైనా మేల్కొని నడిగూడెం రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించాలి" అని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. చెరువులు నిండి పంటలకు నీరు అందుతుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురవుతోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎల్34, ఎల్35 ఎల్36 తదితర లిఫ్టుల ద్వారా సమృద్ధిగా నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రకటనలు చేయడం కంటే, క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే చర్యలు తీసుకోవడం ముఖ్యమని ఆయన అన్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు అవసరమైన నీటిని సకాలంలో అందించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించి, చెరువులను నింపి, ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. సాగునీటి సమస్యపై ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు నీటిపారుదల శాఖ అధికారికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు.

# సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గూడూరు నిఖిల్ రెడ్డి

## తెలంగాణ అభివృద్ధి, ప్రజల సుఖసంతోషాల కోసం ఆకాంక్ష



బీబీనగర్: అక్టోబర్21, (మనం న్యూస్) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన తెలంగాణ యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని నిఖిల్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరుకున్నారు.

# పోలీస్ అమరవీరుల సేవలు స్ఫూర్తిదాయకం

## బీబీనగర్ సీఐ సూర్య నాయక్



బీబీనగర్: అక్టోబర్21, (మనం న్యూస్) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరులకు బీబీనగర్ సీఐ సూర్య నాయక్ నివాళులర్పించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తామని సీఐ పేర్కొన్నారు.

# దసరాకు బగ్గుమన్న ఏదుల!

**-సర్పంచ్ పరశురాములు యాదవ్ ను అవమానపరిచిన అగ్రవర్ణ పెద్దలు**

**-సర్పంచ్ జమ్మి వృక్షానికి పూజ చేయించిన అగ్రవర్ణాలు**

**-అగ్రవర్ణాల పెత్తనంపై ఆందోళన వ్యక్తం చేసిన గ్రామస్తుట**

**-శమీ పూజలో కుల విభేదాలు**

**-బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**-ఎంపీడీవో, డీఎల్పీవోలు చర్యలు తీసుకోవాలి**



ఉమ్మడి గోపాలపేట, అక్టోబర్ 21 (మనం న్యూస్) : ఆనందం, సంతోషాలు నిండే దసరా పండుగ వేళ ఏదుల గ్రామం బగ్గుమంది. దూర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులంతా రంగురంగుల దుస్తులు ధరించి జమ్మి పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన వేళ బీసీ బిడ్డకు అవమానం ఎదురైంది. నిబంధనల ప్రకారం గ్రామ సర్పంచ్ తోనే పూజా కార్యక్రమాలు చేయాల్సి ఉండగా, అగ్రవర్ణాలకు చెందిన కొంతమంది పెద్దలు కల్పించుకుని, గ్రామ ప్రథమ పౌరుడు, బీసీ బిడ్డ అయిన సర్పంచ్ పరిశరాములు యాదవ్ కు సమాచారం కూడా ఇవ్వకుండా వారి ఇష్టానుసారంగా పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈ అవమానంపై ఏదుల గ్రామం ఒక్కసారిగా భగ్గుమంది. "బీసీ బిడ్డ సర్పంచ్ అయితే ఇలా అవమానిస్తారా?" అంటూ గ్రామ ప్రజలంతా ఆగ్రహంతో ఆందోళన చేపట్టారు. మంగళవారం విజయదశమి సందర్భంగా జమ్మి చెట్టు వద్ద అధికారికంగా చేయాల్సిన శమీ పూజకు సర్పంచ్ కు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా, కొంతమంది అగ్రవర్ణ భావజాలం కలిగిన నాయకులు ముందుగానే సొంతంగా పూజ చేసుకోవడం అత్యంత అవమానకరం, అప్రజాస్వామికం. "ఇది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు. రాజ్యాంగం ఇచ్చిన పదవిని, ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్ పీఠాన్ని అవమానించడమే" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ బిడ్డ ఒకరు సర్పంచ్ అయితే జీర్ణించుకోలేని కొందరి కుల అహంకారానికి ఇది నిదర్శనమని, ఇలాంటి చర్యలు గ్రామ ఐక్యతకు గొడ్డలిపెట్టు అని అన్నారు. ఈ ఘటనపై MPDO, DLPO లు వెంటనే విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, బాధిత సర్పంచ్ కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది పరశురాం యాదవ్ కు జరిగిన అవమానం కాదు, ఏదుల గ్రామ ప్రజలందరికీ జరిగిన అవమానమని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.






# ఒకే కుటుంబంలో ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు

## డిఎస్పీ, ఎస్సైగా ఉద్యోగులుగా పొందిన వారికి సర్పంచ్ శ్రీనివాస్ సన్మానం

అనంతగిరి అక్టోబర్ 21 (మనం న్యూస్ ): మండలం వాయిలసింగవరం గ్రామంలో ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో సిరిసిల్ల డీఎస్పీగా ఎంపికైన సట్టు భవానీ, ఉప్పల్ ఎస్ఐగా ఎంపికైన సట్టు వినయ్ లను గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన సట్టు భవానీ, వినయ్ లు చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలో పట్టుదలతో చదువుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించడం అభినందనీయమని సర్పంచ్ కొనియాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన సట్టు అచ్చయ్య, సీతమ్మ దంపతులు ఎంతో కష్టపడి పిల్లలను చదివించి ప్రయోజకులను చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు వారికి షీల్డులను బహూకరించారు. గ్రామానికి చెందిన విద్యావేత్త, కోదాడ డిస్టెన్స్ అకాడమీ కోఆర్డినేటర్ గద్దె రాంబాబు ప్రముఖులకు సంబంధించిన పుస్తకాలను బహూకరించి అభినందనలు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన అక్కా తమ్ముళ్లు ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు వీరిని ఆదర్శంగా తీసుకుని మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గద్దె రఘు, కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, గుండ్లపల్లి వెంకన్న, దాములూరి మురళి, బుర్రా నాగమల్లేశ్వరరావు, బుర్రా వీరబాబు, నేరెళ్ల నాగేశ్వరరావు, వార్డు సభ్యులు అమ్మరబోయిన వంశీ, బుర్రా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం!

**రూ.7.50 లక్షల తొలి బిల్లు తీసుకున్న కాంట్రాక్టర్**

**పనుల జాప్యంపై గ్రామస్థుల ఆవేదన.. ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

**చిన్నారులు, గర్భిణీలకు తప్పని ఇబ్బందులు**



అనంతగిరి అక్టోబర్ 21( మనం న్యూస్) : అంగన్‌వాడీ చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న అంగన్వాడి భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.

**రూ.7.50 లక్షల బిల్లు తీసుకున్నా.. పూర్తికాని పనులు!**

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్ మొదటి బిల్లుగా రూ. 7.50 లక్షలు తీసుకున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయినప్పటికీ భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తికాకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు. భవనం బయట, లోపల పనులు అసంపూర్తిగా ఉండటంతో నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏఈ, డీఈ అధికారులు పట్టించుకోవడం లేదా?**

నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన సంబంధిత ఏఈ, డీఈ అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజాధనంతో చేపట్టిన నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.

**ఎమ్మెల్యే స్వయంగా రూపొందించిన ప్లాన్!**

అంగన్‌వాడీ భవనం త్వరగా పూర్తిచేసి చిన్నారులు, గర్భిణులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే స్వయంగా భవన నమూనా (బిల్డింగ్ ప్లాన్) రూపొందించి నిధులు మంజూరు చేయించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ పనుల పూర్తిపై దృష్టి సారించకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి..**

గ్రామంలోని అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిర్మాణ పనుల జాప్యానికి కారణాలను గుర్తించి, కాంట్రాక్టర్‌కు తగిన ఆదేశాలు జారీ చేయాలని చిన్నారులు, గర్భిణుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.





# కొండమడుగులో ఘనంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు, మహిళా భక్తులు**



బీబీనగర్: అక్టోబర్21, (మనం న్యూస్) : బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవ విగ్రహ నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల జయజయధ్వానాలు, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ శోభాయాత్ర కొనసాగింది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించిన భక్తులు, నిమజ్జన శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం

**TGSPDCL సీఎండీ జితేశ్ వి. పాటిల్**

**భూగర్భ జలాల సంరక్షణ, విద్యుత్ పొదుపుపై దృష్టి సారించాలి**

**బీబీనగర్ మండలం భట్టుగూడెం, చిన్నరావులపల్లి, బ్రహ్మణపల్లిలో ఆకస్మిక తనిఖీలు**

బీబీనగర్, అక్టోబర్ 21: (మనం న్యూస్) : రైతులు సంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండించే పంటలను సాగు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని TGSPDCL సీఎండీ జితేశ్ వి. పాటిల్ ఐఏఎస్ సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్న నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గించి, భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి, చినరావులపల్లి, బట్టుగూడెం గ్రామాలతో పాటు వలిగొండ మండలంలోని మందాపురం గ్రామాలను సీఎండీ ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వ్యవసాయ సమస్యలు, పంటల సాగు విధానాలు, నీటి లభ్యతపై చర్చించారు. మునగ, వివిధ రకాల కూరగాయలు వంటి వాణిజ్య పంటలను సాగు చేయడంతో పాటు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, మేకల పెంపకం వంటి అనుబంధ రంగాలపై దృష్టి సారిస్తే రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. వరి సాగుతో పోలిస్తే తక్కువ నీరు, విద్యుత్ అవసరమయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా పెట్టుబడి, నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

**రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి**

రైతులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని విద్యుత్ అధికారులను సీఎండీ ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి, సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో TGSPDCL డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ (రూరల్ జోన్) యు. బాలస్వామి, యాదాద్రి సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. సురేశ్ కుమార్, భువనగిరి డివిజనల్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వర్లు, డివిజనల్ ఇంజనీర్ విజయభాస్కర రెడ్డి, బీబీనగర్ ఏడీఈ వి. మచ్చేందర్, ఏఈ డి. మనోహర్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, లైన్ మెన్ లు భుక్య నరేందర్, స్వామి, బాల్ నర్సింహ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.







## రాజరాజేశ్వరి అవతారంలోని దుర్గాదేవికి పూజలు

చౌటుప్పల్, అక్టోబర్ 21 (మనం న్యూస్) : చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి శరన్నవరాత్రులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని రాజరాజేశ్వరి అవతారంలోని దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారి చీరల వేలంపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలం పాటలో పాల్గొన్న విజేతలకు చైర్ పర్సన్ అమ్మవారి చీరలను అందజేశారు. వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు పెద్ది సుధాకర్ శర్మ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, ధర్మకర్తలు వర్కాల రవిగౌడ్, ఆవుల యేసుయాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణ, మాజీ ధర్మకర్త ఉప్పుల కుసుమ, బొబ్బిళ్ళ శ్రీరాములు, మునుకుంట్ల సత్యనారాయణగౌడ్, సుర్వి నర్సింహాగౌడ్, బొడిగె బాలకృష్ణగౌడ్, ఉప్పల దీపిక, దాడి పద్మ, మామిడి రాములు, డాకోజి శ్రీనివాస్, గడ్డిపాటి విజయలక్ష్మి, తేలుకుంట్ల వసంత, ఎర్రగోని భాస్కర్, అన్నమోని నవనీత, బొబ్బిళ్ళ సామ్రాట్, గంజి నాగరాజు, కాసోజు మధు, సోనునాయక్,రోహిత్ మిశ్రా పాల్గొన్నారు.



## విధి నిర్వహణలో నరేందర్ అంకితభావం అభినందనీయం

**భట్టుగూడెం లైన్‌మెన్ పనితీరును ప్రశంసించిన TGSPDCL సీఎండీ జితేశ్ వి. పాటిల్..**

**శాలువాతో సన్మానించి అభినందనలు..**



బీబీనగర్, అక్టోబర్ 21:(మనం న్యూస్) : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ విద్యుత్ వినియోగదారులకు సేవలందిస్తున్న భట్టుగూడెం విద్యుత్ లైన్‌మెన్ నరేందర్ పనితీరును TGSPDCL సీఎండీ జితేశ్ వి. పాటిల్ ఐఏఎస్ ప్రశంసించారు. బుధవారం మండలంలోని భట్టుగూడెం గ్రామ పర్యటనకు వచ్చిన సీఎండీ, నరేందర్ సేవలను అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. విద్యుత్ శాఖలో లైన్‌మెన్ల పాత్ర ఎంతో కీలకమని, క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వారి కృషి ప్రశంసనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయి సిబ్బంది చూపే చొరవ, సమయపాలన, అంకితభావం ప్రజలకు ఎంతో మేలు చేస్తాయి. నరేందర్ పనితీరును సీఎండీ స్వయంగా ప్రశంసించి సన్మానించడం విద్యుత్ శాఖ సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ గుర్తింపు తన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో TGSPDCL డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ (రూరల్ జోన్) యు. బాలస్వామి, యాదాద్రి సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. సురేశ్ కుమార్, భువనగిరి డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) ఎస్. వెంకటేశ్వర్లు, డివిజనల్ ఇంజనీర్ (MRT) విజయభాస్కర రెడ్డి, బీబీనగర్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వి. మచ్చేందర్, అసిస్టెంట్ ఇంజనీర్ డి. మనోహర్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, లైన్ మెన్ లు స్వామి, బాల్ నర్సింహ, క్షేత్రస్థాయి సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## విజయదశమి అందరికీ విజయాలను అందించాలి

**చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**



చౌటుప్పల్, అక్టోబర్ 21(మనం న్యూస్) : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కచ్చీరు వద్ద శమీ పూజ కార్యక్రమంలో పాల్గొన్న చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని కచ్చీరు వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ శమీ పూజ నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని, ప్రజలు చేపట్టే ప్రతి కార్యంలో విజయాలు సాధించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రావణాసురుడి వధ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవీ నవరాత్రుల్లో భవానీ దీక్షలు చేపట్టే వారి సంఖ్య చౌటుప్పల్ మున్సిపాలిటీలో పెరిగింది. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు దీక్షలు తీసుకోవడం శుభ పరిణామం అన్నారు. విజయదశమి వేళ ప్రజలందరికీ విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు, దేవి అందరికీ శుభాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, చౌటుప్పల్ పుర ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## నేడు బీబీనగర్ మండలంలో 'రైతు నేస్తం' ప్రత్యక్ష ప్రసారం

**రైతు వేదికల్లో పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి పద్మ పిలుపు**



బీబీనగర్, అక్టోబర్ 21, (మనం న్యూస్): రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రసంగంతో పాటు పత్తి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కార్యకలాపాలు, 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని గురువారం (నేడు) రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 8:30 గంటలకు ప్రారంభం కానుంది. మండలంలోని బీబీనగర్, పడమటిసోమారం, రాయరావుపేట రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మన్, సర్పంచులు, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు, రైతులు, యువత, హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి పద్మ కోరారు. రైతు సోదర సోదరీమణులు తమకు సమీపంలోని రైతు వేదికలకు ఉదయం 8:30 గంటలకే చేరుకుని కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రైతులకు సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలు, వ్యవసాయ రంగంలో చేపడుతున్న చర్యలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఈ ప్రత్యక్ష ప్రసారం ఉపయోగపడుతుందని తెలిపారు.

# అన్నారంలో కనకదుర్గాదేవి లడ్డూ, చీరల వేలం ఘనం

**భక్తి భావంతో పోటీపడిన భక్తులు వేలంలో అత్యధిక ధరలు.**

**రూ.57,500కు లడ్డూ ప్రసాదం.. రూ.18 వేలకు అమ్మవారి చీర**

**మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో...గ్రామంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ**

**భక్తి ఉన్నచోటే శక్తి**

**ఆధ్యాత్మికత ఉన్నచోటే అభివృద్ధి**

**సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి**



తుంగతుర్తి ,అక్టోబర్ 21,( మనం న్యూస్) : మండల పరిధిలోని అన్నారం గ్రామంలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మాత ఉత్సవ కమిటీ నిర్వహణలో అమ్మవారి లడ్డు ప్రసాదం, చీరల వేలం కార్యక్రమాన్ని మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అమ్మవారి లడ్డూ ప్రసాదం వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా, రూ.57,500ల అత్యధిక ధరకు పోగుల చందు రెడ్డి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అలాగే అమ్మవారి చీర వేలంలో రూ.18,000ల అత్యధిక ధరకు పొన్నాల మంగమ్మ చీరను భక్తిశ్రద్ధలతో సొంతం చేసుకున్నారు. వేలం కార్యక్రమం సందర్భంగా భక్తుల్లో నెలకొన్న ఉత్సాహం, అమ్మవారిపై ఉన్న అపారమైన విశ్వాసం, భక్తిభావం ఆకట్టుకున్నాయి. అమ్మవారి ప్రసాదం, చీరలను దక్కించుకోవడం కేవలం వేలంలో విజయం మాత్రమే కాకుండా అమ్మవారి అనుగ్రహానికి ప్రతీకగా భావిస్తూ భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. అత్యధిక ధర పలికిన భక్తులకు లడ్డూ ప్రసాదం చీరలను అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలు గ్రామ ప్రజలందరినీ భక్తి, ఆధ్యాత్మిక చింతన, ఐక్యతతో ఏకం చేసే పవిత్రమైన వేడుకలని అన్నారు. అమ్మవారి కృపతో గ్రామంలో సుఖశాంతులు, సౌభాగ్యం ,పాడిపంటలు ,సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ప్రసాదాన్ని పొందడం అదృష్టం అమ్మవారి ఆశీస్సులను పొందడం మహాభాగ్యం అనే భక్తి భావంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న విధానం విశేషంగా నిలిచింది. అమ్మవారి సన్నిధిలో భక్తి గీతాలు జై జై కనకదుర్గ దేవి నమాస్మరణలతో పరిసరాల ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.అమ్మవారి ఆశీస్సులతో అన్నారం గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఉప సర్పంచ్ సరిత, బింగి వెంకటేశ్వర్లు, శ్యాంప్రసాద్, బల్లెం ప్రవీణ్, సుకన్య, లలిత, జానకమ్మ,మాతా ఉత్సవ కమిటీ సభ్యులు రేగటి శ్రీకాంత్, సాయి ప్రసాద్ ,రంజిత్ ,వినయ్ ,ధనుష్ ,శ్రీవిన్ను ,వంశీ ,గణేష్ ,భావిష్ ,శేఖర్ ,త్రిలోక్ ,సాత్విక్ గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



# ఘనంగా జమ్మి పూజ

మేళ్లచెరువు అక్టోబర్ 21 మనం న్యూస్: స్థానిక శ్రీ ఇష్టకామేశ్వరి సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం విజయదశమి పర్వదినం సందర్భంగా సాయంత్రం జమ్మి చెట్టు క్రింద శమీ పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ పరాభవ నామ సంవత్సర అశ్వయుజ శుద్ధ విజయదశమి నుండి శ్రీ ప్లవంగనామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ విజయదశమి వరకు సర్వ జనావళికి సర్వ సుఖములు, ఆయురారోగ్య అష్ట ఐశ్వర్యములు, కలగవలెనని పూజారులు పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎన్. శంబిరెడ్డి రెడ్డి. పురోహితులు కె.మృత్యుంజయ శాస్త్రి. ఆలయ అర్చకులు కె. విష్ణువర్ధన్ శర్మ. ధనుంజయ్ శర్మ. ఉత్సవ కమిటీ చైర్మన్ పెండ్లి లచ్చయ్య. గ్రామ సర్పంచ్ బచ్చు పద్మ శ్రీనివాస్ రెడ్డి. కాకునూరి భాస్కర్ రెడ్డి. మాజీ దేవాలయ చైర్మన్లు కాకునూరు వెంకటరెడ్డి. గజ్జల శంకర్ రెడ్డి. శాగం రెడ్డి శంభి రెడ్డి కందుల సురేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వరగాని నాగరాజు, బారెడ్డి వెంకటరెడ్డి, ముడెం శ్రీనివాస్ రెడ్డి, ము డెం అంజిరెడ్డి, బుస్సా రామారావు. దేవమణి. మరియు గ్రామ పెద్దలు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డికి పింగల్ రెడ్డి దసరా శుభాకాంక్షలు



బీబీనగర్: అక్టోబర్21, (మనం న్యూస్) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి– కిరణ్ జ్యోతి దంపతులను వలిగొండలోని వారి స్వగృహంలో ఆప్యాయంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తి రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె బాలరాజు, ఎండీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



# రూ.10 కోట్లతో రోడ్ల మంజూరు

**మంత్రి, ఎమ్మెల్యేకు పాలాభిషేకం**

**ఉత్తమ్ కుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డికి శ్రీరంగాపురం గ్రామస్థుల కృతజ్ఞతలు**

కోదాడ//నడిగూడెం, అక్టోబర్ 21(మనం న్యూస్) నడిగూడెం మండల పరిధిలోని శ్రీరంగాపురం నుంచి సిరిపురం, శ్రీరంగాపురం నుంచి వల్లాపురం వరకు రెండు రహదారులను రూ. 10 కోట్లతో తారు రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి శ్రీరంగాపురం గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు కలిసి మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ రెండు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల శ్రీరంగాపురం, సిరిపురం, వల్లాపురం గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రహదారుల అభివృద్ధితో మూడు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి సహకరించిన మంత్రి, ఎమ్మెల్యేకు ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటామని గ్రామస్థులు తెలిపారు.

# కన్నుల పండుగగా స్వాముల ఇరుముళ్ళు

**రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ**

**లింగాల కనకదుర్గాలయంలో వెల్లువిరిసిన భక్తి భావం**

**ముగిసిన దేవి శరన్నవరాత్రోత్సవాలు**

పెన్ పహాడ్ అక్టోబర్ 21 (మనం న్యూస్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవాని మాల ధరించిన మాలధారణ స్వాముల ఇరుముళ్ల కార్యక్రమం మంగళవారం వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో కన్నుల పండుగగా నిర్వహించారు ఈ సందర్భంగా మండలంలోని లింగాల గ్రామంలో కనకదుర్గ దేవాలయంలోని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు కనకదుర్గా దేవి శ్రీ రాజరాజేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చింది సుమారు 170 మంది భక్తులు మాల ధారణ చేసి స్థానిక పురోహితులు ఇరువంటి సత్యనారాయణ శర్మ చేతుల మీదుగా ఇరుముళ్ళను ధరించారు దేవాలయంలో ఇరుముళ్ళ ధరించిన స్వాములతో పాటు పురోహితులు అమ్మవారిని చేతులతో ఎత్తుకొని నృత్యం చేయడంతో ఆలయంలో భక్తి భావం వెల్లి విరిసింది అనంతరం మాలధారణ చేసిన స్వాములు ఇరుముళ్ళను నెత్తిన ధరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అన్ని ఆలయాలను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు దీంతో దేవిశరన్ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి ఈ కార్యక్రమంలో సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి, కనకదుర్గ ఆలయ కమిటీ చైర్మన్ కేసిరెడ్డి కోటిరెడ్డి, శివాలయం చైర్మన్ దాచేపల్లి సుధాకర్,ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# వికలాంగులకు ఉపాధి పనుల కేటాయింపు

కోదాడ, అక్టోబర్ 21(మనం న్యూస్): మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో బుధవారం వీబీజీ రామ్‌జీజ పథకంలో భాగంగా వికలాంగులకు ఉపాధి పనులు కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మందుల నాగయ్య వికలాంగులు చేస్తున్న పనులను పరిశీలించి, వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా వికలాంగులకు ఉపాధి లభించడంతో పాటు ఆర్థికంగా తోడ్పాటు అందుతుందని సర్పంచి మందుల నాగయ్య తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ పథకంలో భాగస్వాములై ఉపాధి పనుల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ భిక్షం పాల్గొన్నారు.



# ఎర్రగుంటపల్లిలో బహుజన బతుకమ్మ సంబరాలు

**అంబేద్కర్ విగ్రహం సాక్షిగా**

**ఆడపడుచుల ఐక్యత.. కుల వివక్షకు వ్యతిరేకంగా నూతన అధ్యాయం!**



డిండి మండలం అక్టోబర్ 21(మనం న్యూస్) : డిండి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో బహుజన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ వేడుకల్లో ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు ఐక్యంగా పాల్గొన్న ఈ వేడుకలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంప్రదాయంగా తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఆడపడుచు సమాన గౌరవంతో జరుపుకోవాలనే సంకల్పంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో కులాల ఆధారంగా పండుగల నిర్వహణలో వివక్ష కొనసాగుతోందని, ఇలాంటి సామాజిక అంతరాలను తొలగించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

**కుల వివక్షకు చరమగీతం పాడాలి**

బతుకమ్మ పండుగ అనేది ఒక వర్గానికో, ఒక కులానికో పరిమితమైనది కాదని, తెలంగాణ ఆడపడుచులందరికీ చెందిన సాంస్కృతిక పండుగ అని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న సామాజిక అసమానతలకు స్వస్తి పలుకుతూ, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం కల్పించాలనే సందేశంతో ఎర్రగుంటపల్లిలో ఈ వేడుకలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. గ్రామంలో పుట్టి పెరిగిన ప్రతి ఆడపడుచుకు పండుగల్లో సముచిత స్థానం కల్పించాలని, కులాల పేరుతో ప్రజలను విభజించి పండుగల ఆనందానికి దూరం చేయడం సరికాదని వారు స్పష్టం చేశారు. పండుగలు ప్రజలను విడదీయడానికి కాకుండా, అందరినీ ఒక్కతాటిపైకి తీసుకువచ్చి ఐక్యతను పెంపొందించడానికి దోహదపడాలని అన్నారు.

**అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో బహుజన ఐక్యత**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ద్వారా సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం అనే విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు సమూహంగా పాల్గొనడం గ్రామంలో సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ వేడుకలు కేవలం పండుగ సంబరాలకే పరిమితం కాకుండా, సమాజంలో సమానత్వ భావనను బలపరిచే కార్యక్రమంగా నిలవాలని వారు ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, ఐకమత్యంతో పండుగలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

**ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తాం**

ఎర్రగుంటపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతి సంవత్సరం బహుజన దసరా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రకటించారు. గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని, ఆడపడుచుల గౌరవం, ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. బహుజనుల ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు గ్రామంలో కొత్త చర్చకు దారితీశాయని, సమానత్వం, సామాజిక న్యాయం దిశగా ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

# ఘనంగా దసరా పండుగ వేడుకలు

**సర్పంచ్ స్వర్ణ ఆధ్వర్యంలో జమ్మి పూజలు**

**పాలపిట్టను దర్శించుకున్న గ్రామాల ప్రజలు**



పెన్ పహాడ్ అక్టోబర్ 21 (మనం న్యూస్): మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో దసరా (విజయదశమి) పండుగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు జమ్మి చెట్టు వద్దకు వెళ్లి పాలపిట్టని దర్శించుకున్నారు.. మండలంలోని లింగాల గ్రామంలో సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బాజా భజంత్రీల నడుమ జమ్మి చెట్టు వద్దకు వెళ్లిన గ్రామస్తులతో కలిసి సర్పంచ్ దంపతులు జమ్మి చెట్టుకు ప్రదక్షణలు చేసి పురోహితులు ఇరువంటి సత్యనారాయణ శర్మ చేతుల మీదుగా పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు సిద్ధించాలని, పాడిపంటలు అనుకూలించాలని, అన్ని పనులలో విజయం చేకూరాలని కోరుకున్నట్టు తెలిపారు జమ్మి చెట్టు వద్ద ప్రదక్షణలు చేసుకున్న తర్వాత ప్రతి ఒక్కరు తెల్ల కాగితంపై శమి శమియతే పాపం అనే శ్లోకంతో పాటు తమ కోరికలను రాసి జమ్మి చెట్టుకు పెట్టి దానం చేశారు ఈ పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నివసించే గ్రామస్తులు గ్రామానికి విచ్చేయడంతో గ్రామంలో సందడి నెలకొంది ఈ కార్యక్రమంలో వివిధ ఆలయాల చైర్మన్లు కేశిరెడ్డి కోటిరెడ్డి,దాచేపల్లి సుధాకర్, ఉపసర్పంచ్ రణపంగ లచ్చయ్య, వివిధ పార్టీల నాయకులు కనకదుర్గ మాలధారణ స్వాములు, మహిళలు, గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా విజయ దుర్గా దేవి శోభాయాత్ర

**ప్రత్యేక రథంపై అమ్మవారి ఊరేగింపు**

**భారీగా తరలివచ్చిన భక్త మహాజనులు**

**కని విని ఎరుగని రీతిలో ఏర్పాటుచేసిన పటాకులు**

**ఆకట్టుకున్న స్వరం,మల్లె పందిరి, జపాన్ రింగ్, ఈత చెట్టు**

నేరేడుచర్ల అక్టోబర్ 21 మనం న్యూస్ : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో కొలువై ఉన్న శ్రీ విజయ దుర్గ దేవి అమ్మవారి ఆలయంలో శ్రీదేవి నవరాత్రులు మహోత్సవాలలో నవరాత్రులు పూజలు అందుకున్న విజయదుర్గాదేవి అమ్మవారి ఉత్సవమూర్తి శోభయాత్ర బుధవారం పురవీధులలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.14 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిరోజు అమ్మవారు వివిధ రకాల అవతారాలలో భక్తులకు దర్శనం అందించారు. బతుకమ్మ పండుగ తో పాటు అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. శ్రీ నింబ మహాలక్ష్మి సమేత శ్రీ అశ్వర్ధ నారాయణస్వామి కళ్యాణం కమనీయంగా నిర్వహించారు.శ్రీ సరస్వతి మాత అమ్మవారి సాక్షిగా విద్యార్థులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీర్ఘ సుమంగళి గా దీవించమని అమ్మవారిని కోరుతూ మహిళా మణులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ పూజారులు ప్రత్యేకంగా కుటుంబ సమేతంగా చండీ సప్తశతి హోమం నిర్వహించారు. సుమారు 6000 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. విజయదశమి రోజు రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా జమ్మి చెట్టుకు పుర ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రత్యేక రథంపై అమ్మవారిని ఏర్పాటు చేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో అమ్మవారి శోభాయాత్ర అంగరంగ వైభవంగా పట్టణ వీధులలో ఊరేగించారు. పుర ప్రముఖులు ఆలయ కమిటీ వారు తోడు రాగా భాజా భజంత్రీలతో సన్నాయి మేళలతో డీజే చెప్పులతోభాజా భజంత్రీలతో సన్నాయి మేళలతో డీజే పాటలతో మహిళా మణుల భజనలతో పట్టణ ప్రధాన సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహించారు.అనంతరం పట్టణంలో కని విని ఎరుగని రీతిలో బాణసంచా పేలుస్తూ సంబరాలు నిర్వహించారు. నాదస్వరం మల్లె పందిరి జపాన్ రింగ్ ఈత చెట్టు స్విచ్బొట్లు అవ్వాయి సువ్వాయి ఆకాశ దీపాలు ఆకాశ దీపాలు వివిధ రకాల మానస భక్తజనులను అలరింపజేశాయి. నేరేడుచర్ల మండలం తో పాటు గరిడేపల్లి పాలకవీడు మండలాల ప్రజలు ఈ వేడుకలను తిలకించారు.



# డ్రైవర్ కుటుంబానికి అండగా లారీ యూనియన్

**మృతుడి కుమారుడి పేరుపై రూ.70 వేల ఫిక్స్డ్ డిపాజిట్**

పెన్ పహాడ్, అక్టోబర్ 21(మనం న్యూస్):తమ తోటి లారీ డ్రైవర్ మృతితో విషాదంలో ఉన్న కుటుంబానికి పొట్లపహాడ్ లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన కొండ నాగరాజు లారీ డ్రైవర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత సంవత్సరం హుజూర్నగర్లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలు కాగా అప్పటి నుంచి చికిత్స పొందుతు గాయం తీవ్రత కారణంగా 15 రోజుల క్రితం మృతి చెందాడు. నాగరాజుకు భార్య లావణ్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. మృతుని తండ్రి అనారోగ్యంతో దయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న వారి పరిస్థితికి చలించిపోయిన పొట్లపహాడ్ లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు ఇప్పటికే నాగరాజు చికిత్సకు 70 వేల రూపాయలు అందించిన వారు బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి మృతుని కుమారుడి భవిష్యత్తు కోసం మరో 70వేల రూపాయలను బాలుడి పేరుపై బ్యాంకులో ఫిక్స్డ్ డిపాజిట్ చేశారు. తోటి డ్రైవర్ కుటుంబానికి అండగా నిలిచి, చిన్నారి భవిష్యత్తుకు భరోసా కల్పించిన యూనియన్ సభ్యుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పొట్లపహాడ్ లారీ యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





# 50 వసంతాల వేడుకను వచ్చే ఏడాది ఘనంగా జరుపుకుందాం

**వనపర్తి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందాం**

**షమీ పూజలో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి) : వచ్చే ఏడాది 50 వసంతాల వేడుకను ఘనంగా జరుపుకుందామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని మంగళవారం వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన షమీ పూజలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. విజయదశమి పర్వదినాన శమీ వృక్షాన్ని పూజించడం అత్యంత పుణ్యప్రదమని శాస్త్రాలు చెబుతున్నాయి. పాండవులు అజ్ఞాతవాస సమయంలో తమ ఆయుధాలను శమీ వృక్షంపై దాచి, విజయదశమి రోజున తిరిగి తీసుకుని విజయం సాధించారని పురాణ కథనం. అందుకే ఆ రోజున శమీ పూజ చేయడం వల్ల శత్రు దోషాలు తొలగి, విజయం, ఐశ్వర్యం, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతారు. అదే సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఎమ్మెల్యే కుటుంబం స్వామివారి సన్నిధిలో షమీ పూజ నిర్వహించారు. పూజలో ఎమ్మెల్యే సతీమణి శారద రెడ్డి, కుమారులు నవనీత్ రెడ్డి, మనోజ్ రెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుటుంబానికి ధర్మకర్త రఘునాథాచార్యులు స్వాగతం పలికి, వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శమీ పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వనపర్తి పట్టణ వైభవానికి ప్రతీక అయిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దేవాలయం కేవలం ఆధ్యాత్మిక కేంద్రమే కాక, ప్రజలకు మానసిక ప్రశాంతతను ఇచ్చే దివ్యధామమని అన్నారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఆలయ 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలను పట్టణ ప్రజలు, భక్తులందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఎస్‌ఎల్ఎన్ రమేష్, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# అన్నారంలో ఘనంగా దసరా ఉత్సవాలు

**కులవృత్తుల సంప్రదాయాలకు పెద్దపీట**

**పల్లె సంస్కృతిని చాటిన దసరా వేడుకలు**



తుంగతుర్తి: అక్టోబర్ 21, ( మనం న్యూస్) : తెలంగాణ పల్లె సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, కులవృత్తుల విశిష్టతను ప్రతిబింబించేలా అన్నారం గ్రామంలో దసరా ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో పాటు పండుగ ఉత్సాహాన్ని నింపాయి. పూర్వీకుల నుంచి తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలు, సంప్రదాయాలు, కులవృత్తుల ప్రత్యేకతలకు గౌరవం ఇస్తూ దసరా వేడుకలను నిర్వహించడం విశేషంగా నిలిచింది. పల్లె జీవన విధానంలో ప్రతి కులవృత్తికీ ఉన్న ప్రత్యేక స్థానం, గ్రామ సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యతను చాటే విధంగా కార్యక్రమం సాగింది. గ్రామపంచాయతీ ఆవరణలో పండుగ శోభ వెల్లివిరియగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దలు తమ పూర్వీకుల సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ, యువత వాటి విశిష్టతను తెలుసుకుంటూ, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. "ఆచారాలను కాపాడుకుందాం.. సంప్రదాయాలను భావితరాలకు అందిద్దాం.. మన పల్లె సంస్కృతిని నిలబెట్టుకుందాం" అనే స్ఫూర్తిని చాటుతూ జరిగిన ఈ వేడుకలు అన్నారం గ్రామ ప్రజల ఐక్యతకు, సంస్కృతి పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా మన పూర్వీకుల నుంచి వచ్చిన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసే గొప్ప సందర్భాలని అన్నారు. గ్రామంలో కొనసాగుతున్న ఆచారాలు, కులవృత్తుల సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ ప్రజలందరూ కలిసిమెలిసి సోదరభావంతో పండుగలను జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దొంగరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిత్తలూరి సోమశేఖర్ వార్డు సభ్యులు బింగి వెంకటేశ్వర్లు, మరికంటి శ్యాంప్రసాద్ ,బల్లెం ప్రవీణ్, బోర లింగయ్య లతోపాటు కుంచాల వీరారెడ్డి,ఉప్పల యాదయ్య, కడారి దేవదాసు, మన్నూరి పోతరాజు, దొంగరి వేణు, మహేష్, అజయ్, నవీన్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా దసరా సంబరాలు

**మా పార్టీలు వేరైనా.. మానవత్వంలో మేమంతా ఒక్కటే!**

**టి. గౌరారం కాలనీలో ఐక్యత చాటిన సర్పంచ్ పేర్ల కళ్యాణి లింగమయ్య , ఉపసర్పంచ్ పిల్లి లక్ష్మమ్మ**



డిండి మండలం అక్టోబర్ 21(మనం న్యూస్) : డిండి మండలం టి. గౌరారం కాలని ప్రజలు కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా మానవత్వమే మిన్న అని చాటుతూ టి. గౌరారం కాలనీలో దసరా పండుగను సర్పంచ్, ఉపసర్పంచ్ ఘనంగా నిర్వహించారు. రాజకీయంగా వేర్వేరు పార్టీలకు చెందినప్పటికీ గ్రామాభివృద్ధి, ప్రజల ఐక్యత, సోదరభావం విషయంలో తామంతా ఒక్కటేనని చాటిచెప్పారు. పరస్పర విభేదాలను పక్కనపెట్టి పండుగను కలిసి జరుపుకోవడం ద్వారా ప్రజలకు ఐక్యత సందేశాన్ని అందించారు. దసరా పండుగను పురస్కరించుకుని కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలంతా కలిసి పండుగ సంబరాల్లో పాల్గొంటూ ఆనందంగా గడిపారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, పండుగలు, సామాజిక కార్యక్రమాల సమయంలో ప్రజలంతా ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలని సర్పంచ్, ఉపసర్పంచ్ తమ చర్యల ద్వారా చాటిచెప్పారు.

**రాజకీయాలు వేరు.. మానవత్వం ఒక్కటే!**

ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల సిద్ధాంతాలు వేరుగా ఉండవచ్చని, కానీ ప్రజల మధ్య ఉండే అనుబంధాలు, మానవత్వం, ఆత్మీయత ఎప్పటికీ వేరుకావని పేర్కొన్నారు. గ్రామంలో రాజకీయ విభేదాల కంటే ప్రజల మధ్య ఐక్యతకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కులమతాల పేరుతో, రాజకీయ పార్టీల పేరుతో ప్రజలు విడిపోకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి ఉండాలని పిలుపునిచ్చారు. పండుగలు ప్రజల మధ్య ప్రేమానురాగాలను పెంపొందించడంతో పాటు ఐక్యతను బలోపేతం చేయాలని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తూ, అందరినీ కలుపుకొని ముందుకు సాగడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**గ్రామ ఐక్యతే మా లక్ష్యం**

గ్రామాభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు, సామాజిక ఐక్యతను పెంపొందించడం వంటి అంశాల్లో పరస్పర సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. టి. గౌరారం కాలనీలో నిర్వహించిన దసరా వేడుకల ద్వారా రాజకీయాలు వేరైనా మనుషులంతా ఒక్కటేననే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలిగామని తెలిపారు. భవిష్యత్తులోనూ గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పండుగలు, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. మొత్తానికి.. రాజకీయాలకు అతీతంగా మానవత్వానికి పెద్దపీట వేస్తూ సర్పంచ్, ఉపసర్పంచ్ కలిసి దసరా వేడుకలు నిర్వహించడం గ్రామంలో ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.